# చలం చెప్పని కథ


ఆంగ్లం మూలం: **మామ్**
తెలుగుసేత: **విశ్వం**

**పిలుపుకోసం వాళ్లు ఎదురు చూస్తున్నారు. ఆ విధంగా నిరీక్షించటం వాళ్లు ముగ్గురికీ కొత్తేమీ కాదు. దాన్నే గడచిన ముప్పయి ఏళ్లుగా వాళ్లు సాధన చేశారు. ఆ నిమిషం కోసమే సిద్ధమవుతున్నారు.**

**ఆత్మవిశ్వాసంతో వున్నారనటం అసందర్భంగా వుంటుంది. కాబట్టి వాళ్లు ధైర్యంగా, కావాల్సింది సాధిస్తామన్న ఆశతో వున్నారందాం. విశాలమైన పాపపు పూలతోటలు ఆకర్షిస్తున్నా, రంగులూ, పరిమళాలతో ఆహ్వానిస్తున్నా, పగిలిన హృదయాలతో, తలెత్తుకుని గర్వంగా ఇరుకైన రాజబాటనే ప్రయాణం సాగించారు. ఎట్లాగైతేనేం-ప్రయాణం ముగిసింది... ఫలితం కోసం ఎదురుచూస్తున్నారు. శాస్త్రాలు, సిద్ధాంతులు, మేధావులూ, దేవుడి ఏజెంట్లకు మల్లే మాట్లాడిన వాళ్లూ అన్నేళ్లుగా ఇచ్చిన నమ్మకంతో.**

లోపలి ఆలోచనలు స్పష్టంగా తెలుస్తూనే వున్నాయి కాబట్టి పైకి మాట్లాడుకునే అవసరంలేదు. పెద్ద బరువూ, బాధ్యతా వదిలిపోయినట్లుగా వుంది. ఆ రిలీఫ్‌ని కృతజ్ఞతతో గుర్తించారు. అసాధ్యం అనిపించిన ఆనాటి మోహానికి లొంగిపోయి వుంటే ఈనాడు ఎంత ఆవేదన అనుభవించాల్సి వచ్చేదో! ఎంత క్షోభపడాల్సి వచ్చేదో! ఎంత వెర్రితనం, ఎంత అవివేకంగా వుండేదో. ఈ అనంతమైన జీవితం ఇచ్చే శాశ్వతకాంతిని నాలుగు రోజుల ఆనందంకోసం వొదిలేసి వుంటే! ఒక్కసారిగా ఆశ్చర్యంగా పులి నాకి వొదిలేసిన వాళ్లకు మల్లే తమను తాము చూసుకున్నారు. ఆత్మనిందతో నలిగిపోయే పాపమేమీ వాళ్లు చేయలేదు. ఎంత కఠోరమైనా బతికినన్నాళ్లూ నీతిగానే బతికారు.

ఇంతలో దేవదూతలొచ్చి లోపలికి తీసుకెళ్లారు. లోపల కిటకిటలాడుతుంటే పక్కకు తొలిగి ఒకమూలగా నించున్నారు. ఆ రోజుల్లోనే దేశంలో రాజకీయాలు, మతమూ కలసి చేస్తున్న మారణ కాండ జరుగుతోంది. ప్రాణాలు పోగొట్టు కున్న అమాయక ప్రజలతో, పురుషుల దౌర్జన్యాలకీ, అహంకారానికీ, దోపిడీకి బలై బాధతోనే కాకుండా ఆకలితో, వ్యాధులతో మరణించిన స్త్రీలతో, శిశువులతో ఊర్ధ్వ లోకపు న్యాయస్థానం కిక్కిరిసి వుంది.



ఆ మారణకాండ మూలంగానే వీళ్లు ముగ్గురూ చనిపోయి భూతాలై ఇప్పుడిక్కడ నిరీక్షించవలసి వచ్చింది. వీళ్లుంటున్న నగరం ఆ కల్లోలానికి దాదాపు నాశనమైపోయింది. డా. శాస్త్రి, సుబ్బలక్ష్మి దంపతులు మరణించారు. బాధితుల సేవలో రాత్రింబవళ్లు పనిచేసి నీరసించిన సావిత్రి, తను ప్రేమించిన డా. శాస్త్రి మరణవార్త వినగానే తట్టుకోలేక మరణించింది. భార్యను రక్షిద్దామనుకునే ప్రయత్నం చేయకపోతే డా. శాస్త్రి బతికివుండేవాడే. ఆమెను ఆయన ద్వేషించాడు. ముప్పయి ఏళ్లు ద్వేషించాడు. అయితే, భర్తగా ఆమెపట్ల తన బాధ్యతల్ని ఎప్పుడూ మరిచిపోలేదు. ఆఖరికి ఆ చివరి క్షణంలోకూడా మరోలా చేసి ఆమెను వొదిలించుకోవచ్చని తట్టలేదు ఆ నీతిపరుడికి.

కొంతసేపటికి దూతలు వాళ్లను లోకేశ్వరుడి ముందుకి నడిపించుకెళ్లారు. కాసేపటిదాకా ఆయన వీళ్లని గమనించలేదు. అసలా సమయంలో ఆ త్రిగుణాతీతుడు రవంత చికాకులో వున్నాడు. అంతక్రితమే ఆయన ఒక విప్లవాత్మక మేధావీ, సత్యాన్వేషి అయిన ఒకాయన జీవితాన్ని పరిశీలించి తీర్పు చెప్పాల్సి వచ్చింది. ఆ వ్యక్తి జీవితమంతా సత్యాన్వేషణలో విప్లవాత్మకంగా గడిపి వృద్ధాప్యంలో మరణించిన వాడు. ఆయన అక్కడకు వొస్తూనే లోకేశ్వరుడి మొహంమీదనే 'ఆయనంటే తనకు నమ్మకం లేదని' బహిరంగంగా ప్రకటించాడు. నిజానికది ఆ దేవాధిదేవుడ్ని

కలవరపెట్టే విషయంకాదు. నవ్వేసి వూరుకునే వారే, ఎప్పట్లాగే. కానీ కింద నేలమీద అప్పుడు జరుగుతున్న దారుణాన్ని ఉదాహరణగా ఎత్తిచూపించి భగవంతుడి సర్వశక్తినీ, కరుణనీ సవాల్ చేశాడీ సత్యాన్వేషి.

"దుష్టత్వం అనేది ఎవరూ కాదనలేని వాస్తవం" అంటూ గొంతెత్తి బిగ్గరగా, "అయితే దాన్ని సృష్టి, స్థితి, లయ కారకుడని పూజలందుకుంటున్న ఈ పెద్ద మనిషి చాతకాక తీసెయ్యకపోతే ఈయన శక్తిమంతుడు కాదు" అని ఆ వాదనకు తిరుగులేదన్నట్టు ఉద్ఘాటించాడు. సర్వాంతర్యామికి అటువంటి వాదనేమీ కొత్త కాదుకానీ ఆయనెప్పుడూ దాన్ని పట్టించుకోలేదు. ఎందుకంటే- జ్ఞానులకు ధ్యేయమైన ఆయనకు ఆ ప్రశ్నకు సమాధానం ఎప్పుడూ స్ఫురించలేదు. ఆయనైనా రెండూరెండూ కలిపి అయిదు చేయలేరు కదా! దాన్ని అవకాశంగా తీసుకుని తత్వవేత్తలందరికీ మల్లేనే, ఈ సత్యాన్వేషి కూడా తర్కబద్ధంగానే ఒక అన్యాయమైన నిర్ణయాన్ని వెలికితీసి, "సర్వశక్తిమంతుడూ, కరుణామయుడూ కాని భగవంతుడ్ని నేను నమ్మను" అని తన ఉపన్యాసాన్ని ముగించాడు.

అప్పుడు ఈశ్వరుడు రవంత ఊపిరి పీల్చుకోవటానికన్నట్టు ఒకపక్క వినయంగా నిల్చున్న ఈ మూడు భూతాలమీదకు దృష్టి సారించారు. బతికున్న వాళ్లే, ఆయుష్షు తక్కువని కూడా ఆలోచించకుండా తమని గురించి మాట్లాడేటప్పుడు ఎక్కువగా మాట్లాడుతుంటారు. ఇక చనిపోయిం తర్వాత చెప్పనవసరంలేదు. ఆ కాలాతీత స్థితిలో వాళ్లు మాట్లాడుతుంటే ఆ ఈశ్వరుడు వినాల్సిందే ఓపిగ్గా. కానీ వాళ్లు చెప్పిన కథ టూకీగా ఇది.

డాక్టర్ శాస్త్రి, సుబ్బలక్ష్మి దంపతులు చాలా అన్యోన్యంగానే వుండేవాళ్లు- సావిత్రి పరిచయం అయేవరకు. సావిత్రికప్పుడు పాతికేళ్లు వుంటాయేమో. శాస్త్రికంటే పదేళ్ళు చిన్నది. అవతలి వాళ్లను ఒక్కసారిగా సమ్మోహన పరిచే అందమూ, ఆకర్షణతో వుండేది. శరీరమూ, మనసూ రెండూ ఆరోగ్యంగా వున్నాయి కాబట్టి జీవితంలో సహజంగా వున్న ఆనందాల్ని అనుభవించాలనే ఆసక్తి, ఉత్సాహమూ వున్నాయ్. ఆత్మ సౌందర్యం అంటారే దాన్నికూడా అందుకోగలదేమో. డా. శాస్త్రి, సావిత్రి ప్రేమలో పడ్డారు. అది సాదారణ కామంకాదు. ఆ మోహం వాళ్లను ముంచెత్తి ఉక్కిరి బిక్కిరి చేసింది. ఈలోకమంతా ఇన్ని యుగాలుగా నడిచింది ఆ సమయంలో వాళ్లిద్దర్ని కలపడానికేనన్నట్లు కనిపించేది. వాళ్లు ప్రకృతీ, పురుషులు. కానీ ఆ మొదటి ఉద్రేకపు ఉధృతం నించి తెరిపిన పడి స్పృహలో కొచ్చి నివ్వెర పోయారు. వాళ్లు చాలా మర్యాదస్తులు. ఆత్మగౌరవం కలవాళ్లు. చుట్టూ వున్న సమాజంమీదా, దాని నీతినియమాల మీదా గౌరవమూ, విశ్వాసమూ గలవాళ్లు. ఆ కన్యకెలా ఆయన అన్యాయం చెయ్య గలదు? అప్పటికే పెళ్లయినవాడిని ఆమెం చేసుకుంటుంది? వాళ్లిద్దరి మధ్య పెరుగుతున్న గాఢమైన బంధాన్ని సుబ్బలక్ష్మి గమనించకపోలేదు. ఇటువంటి విషయాలు పైకి కనిపించకపోయినా ఏ చిత్రమైన మార్గాలద్వారా భార్యలకు తెలుస్తాయో ఆ విధంగానే ఆమెకూ తెలిసింది. అన్నేళ్లుగా భర్తమీద వుంచిన విశ్వాసమూ గౌరవమూ, అనురాగమూ కదిలినయ్. తనను వొదిలేస్తాడేమోనన్న భయమూ, ఈర్ష్యా, తనదెవరో లాక్కుపోతున్న క్రోధమూ చోటు చేసుకున్నాయ్. అలాంటివి తనలో వున్నాయని అప్పటిదాకా ఆమెకు తెలియదు- అందరు పవిత్రులకు మల్లేనే. ఇవికాక ఇంకేదో ప్రేమని మించిన అగ్ని కలది ఆమె అంతరాత్మని బాధించటం మొదలెట్టింది. భర్త కావాలని ఇదంతా చేయటంలేదనీ, మోహం దానికదే ఆయన్ని మింగేసిందని ఆమెకు తెలుసు. అయినా భర్తకు దూరమై బతకలేననుకుంది. భర్తనేమీ నిందించలేదు. మౌనంగా కన్నీళ్లు కార్చింది. బలంకోసం కోటిదేవుళ్లను ప్రార్థించింది. ఆ దుర్భరమైన ఘర్షణని డా. శాస్త్రి, సావిత్రి గమనిస్తూనే వున్నారు. ఒక్కోసారి నిగ్రహించుకోలేక పోయేవాళ్లు. కోర్కె వాళ్ల ఎముకల్ని తొలిచేస్తూ వుండేది. ఆ వాంఛతో వాళ్లు శక్తి కొద్దీ పోరాడారు- జటాయువు రావణుడితో తలపడ్డట్టు. కానీ చివరకు గెలిచారు. ఛిద్రమైన హృదయాలతో బోలు గర్వంతో విడిపోయారు. వాళ్లు ఆనందాన్నీ, జీవిత సౌఖ్యాన్నీ, సౌందర్యాన్నీ త్యాగం చేశారు. భగవంతుడి పాదాల చెంత అర్పించారు.

సావిత్రి గుండెరాయి చేసుకుని మానవసేవలో మునిగిపోయింది. ఆర్తులను ఆదుకుంది. అభాగ్యులను గుండెలకు అదుముకుంది. బాధితులకు సేవచేసింది. అనాధాశ్రమాలూ, ధర్మ సంస్థలూ స్థాపించింది. కాలక్రమేణా సౌకుమార్యమూ, సౌందర్యమూ మాయమై హృదయంలాగే మొహంకూడా శిలైంది. ఆవిడ మతం ఇరుకూ, భయంకరమూ. దర్పమూ, తీవి, అధికారమూ, అసహనమూ ఆమెలో చోటు చేసుకున్నాయి. ఆవిడ దయే చాలా క్రూరమైనది- అది ప్రేమనించి కాకుండా హేతువునించి జనించింది కాబట్టి. డా. శాస్త్రి నిరాశతో, నిస్పృహలో కొట్టుమిట్టాడి నిరాసక్తంగా బతకటం మొదలుపెట్టాడు. ఆయన జీవితానికో అర్థమూ, ధ్యేయమూ లేకుండా పోయాయి. మనసుతో పోరాడి పోరాడి అలిసి పోయాడు. ఇప్పుడేమీ లేదు, ఏమీ మిగల్లేదు. భార్య సుబ్బలక్ష్మి మీద రహస్య ద్వేషమూ, కోపమూ తప్ప. కానీ ఆమెపట్ల తన బాధ్యతని ఎప్పుడూ మరిచిపోలేదు.

సుబ్బలక్ష్మి కూడా మర్యాదస్తులైన ఇల్లాళ్లకు మల్లేనే భర్తనెప్పుడూ ఆయన వెర్రికి నిందించలేదు. కానీ తన కోసం ఆయన చేసిన త్యాగాన్ని క్షమించలేకపోయింది. సంస్కారులు పాటించే సున్నితమైన విధానాలద్వారా తనకు తెలియకుండానే సాధించటం మొదలుపెట్టింది. తెలిసినా నిగ్రహించుకోలేకపోయింది. కావాలంటే ఆయనకోసం తన ప్రాణాలైనా ఇచ్చేదే, కానీ తను అంతవ్యధ పడుతుంటే, తను లేకుండానే ఆయన ఆనందంతో వుండగలడన్న వాస్తవాన్ని భరించలేక చచ్చిపోతే బావుణ్ణని పదేపదే అనుకుంది. సరే- నిజంగా అదే జరిగింది ఇప్పుడు. మోడులాగా గడచిన జీవితం ఆఖరయింది. వాళ్లేమీ పాపం చేయలేదు. నమ్మకంగా పుణ్యఫలాలకోసం ఎదురుచూస్తున్నారు.

వాళ్లు తమ కథని పూర్తి చేశారు. ఊర్ధ్వలోకపు న్యాయస్థానం ఊపిరి బిగపట్టి నిశ్శబ్దంగా వుంది.

"ఎట్లాగో చావండి" అనే మాటలు ఆ శాశ్వతుడి నాలుక చివరదాకా వొచ్చాయి కానీ అసందర్భంగా వుంటుందని అనలేదు. పైగా అది సరైన తీర్పు అనికూడా అనిపించుకోదు. ఆయన కనుబొమలు ముడిపడ్డాయి. దృష్టి అర్థాంతర్గతమైంది.

"అయ్యో! ఇందుకా నేను సముద్రాన్నీ, దానిమీద కెరటాల్నీ, వాటికి మెరుగులు పెట్టేందుకు సూర్యోదయాన్నీ సృష్టించింది! ఇందుకా కొండలమీద మంచు మెరిసేట్టు చేసింది! ఇందుకా సెలయేళ్లు కొండ రాళ్ల మధ్య మంజులగానంతో పరిగెత్తేట్టు చేసింది! తూర్పుగాలికి పచ్చని పైరులు ఊగే ఏర్పాటు చేసింది ఇందుకా!" అని వాపోయారు.

చివరికాయన "నక్షత్రాలు మురుక్కాలవల్లోనే అమితంగా, ప్రకాశవంతంగా ప్రతిబింబిస్తాయని అనిపిస్తుంటుంది." అని అన్నారు.

ఆ మూడు భూతాలూ తమ విషాదగాధని పూర్తి చేసి ఆయన ఎదురుగా నిల్చున్నాయ్. అదో చేదు ఘర్షణ. కానీ వాళ్లు బాధ్యత నెరవేర్చారు. కాలుతున్న అగ్గిపుల్లని ఊదేసినంత నెమ్మదిగా ఈశ్వరుడు ఊదాడు. ఆశ్చర్యం! ఆ మూడు భూతాలూ మాయమై పోయినయ్. లయకారకుడు వాళ్లను నాశనం చేశారు.

"అసలు ఈ మనుష్యులు లైంగిక సంబంధాలకు నేనెందుకు ప్రాముఖ్యత నిస్తాననుకుంటారో తెలియదు. ఇటువంటి మనో వ్యాపారాలమీద నాకెంతో సానుభూతి వున్నట్టు నా సృష్టి చూస్తే తెలుస్తుందే!"

ఇంకా సమాధానంకోసం ఎదురు చూస్తున్న సత్యాన్వేషివైపు తిరిగి ఈశ్వరుడు చిరునవ్వుతో ప్రేమగా చూస్తూ- "ఏం మహర్షీ! ఈసారన్నా నేను నా శక్తినీ, కరుణనూ గొప్పగా హాయిగా మిళితం చేసినట్టు నువ్వు ఒప్పుకోక తప్పదు." అన్నారు.

